క్లుప్తంగా

రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

సైదాపురం : ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందజేస్తుందని జాయింట్ డైరెక్టర్ సత్యవాణి తెలిపారు. మండలంలోని కలిచేడు, తురిమెర్ల గ్రామ సేవా కేంద్రాల్లో రైతులతో మంగళవారం సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. రైతులకు పురుగు మందుల వాడకం తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ శ్రీదేవి, ఏఓ హైమావతి పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీపై మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

ఓజిలి: గ్యాస్ తరలించే వాహనాల్లోని డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి రమణయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని వాకాటివారికండ్రిగ గ్రామ జాతీయ రహదారి పక్కన ఏజీపీ సిటీ గ్యాస్ పరిశ్రమ వాహనాల్లో గ్యాస్ తరలించే సమయంలో లీకేజీ, ఫైర్ అయిన సమయాల్లో తీసుకోవాల్సిన భద్రత చర్యలపై మంగళవారం మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమాదాలను నివారించే విధానాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సాగర్ విశ్వాస్, సేఫ్టీ మేనేజర్ శబరి బాబు, సిబ్బంది శ్రీనివాస్, సతీష్, నాయుడుపేట ఫైర్ అధికారి శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

రసాయన ఎరువులు తగ్గించండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న సోమసుందర్

రాపూరు: రైతులు తమ పొలాల్లో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని వ్యవసాయ అధికారి సోమసుందర్ తెలిపారు. మండలంలోని వీరాయిపాళెం, చుట్టుపాళెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలన్నారు. దీనివల్ల ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని జయంపు గ్రామంలో చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ సహకారంతో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. 185 మంది వైద్యశిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహించుకోగా 90 మందికి ఉచితంగా మందులు, 45 మందికి కంటి అద్దాలు, 50 మంది కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. సీఈఓ సీతారామనాయుడు, ఏఓ కృష్ణ, అరవింద్ నేత్రాలయ సిబ్బంది జీవన్ తదితరులు పాల్గొన్నారు.

దోమలను నిర్మూలించాలి

దక్కిలి: గ్రామాల్లో దోమల నిర్మూలనపై దృష్టి సారించాలని డక్కిలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ బిందు ప్రియాంక పేర్కొన్నారు. డక్కిలిలో డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలసి డెంగ్యూవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే దోమలను నివారించవచ్చని చెప్పారు. ప్రతి శుక్రవారం అందరూ డ్రైడేగా పాటిద్దామని డెంగ్యూ వ్యాధిని నివారిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుకుమారి, ఎస్‌యూఓ శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌లు లింగమూర్తి, ఆదిలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్, హరి, షరీఫ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.5లక్షలు పరిహారమివ్వాలి



రైతు కుటుంబాలను పరామర్శిస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

సైదాపురం: స్థానిక పంచాయతీలోని కమ్మవారిపల్లెలో నిమ్మచెట్లను తొలగించిన రైతులకు ఎకరానికి రూ.5లక్షలు పరిహారం ప్రభుత్వం చెల్లించాలని రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్ సుబ్బరాయుడు పేర్కొన్నారు. రైతుకూలీ సంఘం ప్రతినిధులు మంగళవారం తొలగించిన నిమ్మతోటలను పరిశీలించారు. అనంతరం రైతులు తురకా మస్తాన్, శశికుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న నిమ్మచెట్లను తొలగించడం దారుణమని తెలిపారు. 8 నెలలుగా మైనింగ్ మాఫియాతో ప్రభుత్వం కుమ్మక్కై ఎస్సీ, ఎస్టీ, బీసీలను వేధిస్తోందని ఆరోపించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వివి రమణయ్య, జిల్లా అధ్యక్షులు ఆర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

దరఖాస్తులో దాహం దాహం



గ్రామస్తుల దాహం తీర్చుతున్న బావి



గ్రామానికి తాగునీరు సరఫరా చేసే బోరు



గ్రామంలోని వాటర్ ట్యాంక్

- దిష్టి బొమ్మలా వాటర్ ట్యాంక్
- బావి నీరు తాగుతున్న జనం
- పట్టించుకోని అధికారగణం

చిట్టమూరు: మండల పరిధిలోని అరవపాళెం పంచాయతీ ఎగువ దరఖాస్తు గ్రామంలో కొంత కాలంగా తాగునీరు సక్రమంగా సరఫరా కాక గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నాయుడుపేట మండలం స్వర్ణముఖి నది ఒడ్డు నుంచి పైపు లైన్లు ద్వారా గ్రామానికి తాగునీటి సరఫరా అయ్యేది. అయితే ఈ పైపులైను దూరం సుమారు 35 కిలోమీటర్లు కావడంతో ఈ పైపులకు అక్కడక్కడ ఆయా గ్రామాల వారు వీధికొళాయిలు ఏర్పాటు చేసుకోవడంతో చివరి గ్రామం కావడంతో దరఖాస్తుకు నీటి సరఫరా అయ్యేదికాదు. దీంతో దరఖాస్తు పక్క గ్రామం ఎల్లసిరి చెరువు కట్ట వద్ద బోరు వేసి పైపులైను ద్వారా గ్రామంలోని వాటర్ ట్యాంక్‌కు నీటిని పంపింగ్ చేసి, అక్కడి నుంచి గ్రామానికి తాగునీరు సరఫరా చేసేవారు. అయితే బోరులో వచ్చే ఇసుక ట్యాంక్ లోపల, వాటర్ పైపుల్లో చేరడంతో నీటి సరఫరా ఆగిపోయిందని గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామంలో తాగునీటికి నానా ఇబ్బందులు పడుతున్నా రు. చేసేది లేక గ్రామస్తులు కొందరు పొలాల్లో ఉన్న బావి నీటిని తెచ్చుకుని కుటుంబ అవసరాలకు, తాగునీటికి వినియోగించుకుంటున్నారు. మరి కొంత మంది వాటర్ క్యాన్లు కొనుగోలు చేసి తాగుతున్నారు. పలు మార్లు పంచాయతీ పాలకులకు, ప్రభుత్వ అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామస్తులు చెబుతున్నారు. బావిలో నీరు కూడా పాచి పట్టి కలుషితమై ఉన్న ఆ నీటినే తాగాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. గ్రామంలో తాగునీరు సర ఫరా చేసే పైపు లైన్లపై సీసీ రోడ్లు నిర్మించడంతో సమస్య జటిలంగా మారిందన్నారు. పైపుల్లో చేరిన ఇసుకను తొలగించి గ్రామంలో తాగునీరు సరఫరా చేయడానికి చ్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకుమార్ తెలిపారు.

పక్కాగా సర్వే నిర్వహించాలి

ఓజిలి: మండలంలోని స్వమిత్వ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన 20 గ్రామ పంచాయతీల్లో పక్కాగా సర్వే చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటి, భూమి సరిహద్దులను సర్వే చేసి లబ్ధిదారులకు హద్దులు చూపాలన్నారు. ఈమె వెంట ఈఓపీఆర్డీ రేణుక తదితరులు ఉన్నారు.

కండలేరులో 26.7 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 26.792 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1873, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 70, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు		30.7.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	126
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	228
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	252
లేయర్ చికెన్	:	190

అధిక ఖర్చుతో చేసిన పనులపై ఆరా



చెరువు కట్ట వద్ద కొలతలు తీసి తనిఖీలు చేస్తున్న ముగ్గురు కమిటీ సభ్యుల బృందం

చిల్లకూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అత్యధికంగా నిధులు ఖర్చు చేసి పూర్తి చేసిన పనులను త్రీ మ్యాన్ కమిటీ అధికారులు మంగళవారం పరిశీలించారు. మండలంలోని బూదనం గ్రామంలోని చెరువుకు 2021–22లో ఉపాధి నిధుల నుంచి సుమారు రూ 27.69 లక్షలు ఖర్చు చేసి పనులు పూర్తి చేశారు. ఈ పనుల్లో నాణ్యతతో పాటుగా అప్పట్లో ఏవైనా అవకతవకలు చోటు చేసుకున్నాయా అనే విషయాలపై పరిశీలించేందుకు త్రీ మ్యాన్(ముగ్గురు అధికారుల బృందం) కమిటీని జిల్లా ఉన్నతాధికారులు నియమించారు. కమిటీలోని సభ్యులైన క్వాలిటీ కంట్రోల్ డీఈఈ శంకరయ్య, సూళ్లూరుపేట ఉపాధి ఏపీడీ ప్రేమ్‌కుమార్, సోషల్ ఆడిట్ డీఆర్‌పీ పంచరత్నంతో పాటుగా ఇరిగేషన్ ఏఈ ఠాగూర్, ఉపాధి ఏపీఓ గిరిబాబు చెరువు కట్ట పనులను పరిశీలించారు. అనంతరం కొలతలు తీశారు. కట్ట ఎంత ఎత్తు వరకు మట్టితో నింపారు అనే విషయాలను తనిఖీ చేశారు. అనంతరం డీఈఈ శంకరయ్య మాట్లాడుతూ పనుల వివరాలను పూర్తిగా పరిశీలించామని దీనిపై నివేదికలను కలెక్టర్‌కు అందించనున్నట్లు వివరించారు.

వైఎస్ జగన్ పర్యటనపై కూటమి కుట్రలు



మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్ని దుర్మార్గంగా వ్యవహరించిన మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెల్లూరు పర్యటనకు వస్తారని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్పష్టం చేశారు. పట్టణంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సంజీవయ్య మాట్లాడారు. నెల్లూరు జిల్లా జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించేందుకు జగన్‌మోహన్ రెడ్డి గురువారం నెల్లూరుకు రావడం ఖాయమన్నారు. జగన్‌మోహన్ రెడ్డి నెల్లూరు పర్యటనను అడ్డు కునేందుకు అధికార పార్టీ నాయకులు అధికారులు, పోలీసులను లోబరుచుకుని అనేక ఇబ్బందులకు పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు సునామిలా తరలివస్తూ జగన్‌కు నీరాజనం పలుకుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకుని హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు.

ప్రసన్నకుమార్‌రెడ్డిని కలసిన వైఎస్సార్‌సీపీ నేతలు

వాకాడు : మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, బూత్ కన్వీనర్లు మంగళవారం మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఈ నెల 31న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరుకు రానున్నారని, త్వరలో మంచి రోజులు వస్తాయని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. వాకాడు మండల బూత్ కన్వీనర్ పెళ్లూరు కోటీశ్వర రెడ్డి, నాయకులు కోడివాక శ్రీనివాసులు, పాకం భాస్కర్, కరుణాకర్‌రెడ్డి, పుట్టా నాగరాజు ఉన్నారు.

ప్రధాన రహదారిలోనే ఇరుక్కున్న లారీ



ఇరుక్కున్న లారీ

కలువాయి(సైదాపురం): తాము అధికారంలోకి వస్తే గుంతలు లేని రోడ్లు చూస్తారని, కొత్త రోడ్లు వేస్తామని హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి నాయకులు ఆ ఊసే ఎత్తడలేదు. కలువాయి–వెంకటరెడ్డి పల్లి ప్రధాన రహదారిపైనే వెంకటరెడ్డిపల్లి జంక్షన్ వద్ద పెద్ద గుంత ఏర్పడింది. ఇక్కడ తరచు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా మంగళవారం ఐరన్ ఓర్‌తో వెళ్తున్న భారీ వాహనం ఆ గుంతలో ఇరుక్కుపోయింది. జేసీబీలతో సహాయంతో తీసిన వెంటనే మరో లారీ వచ్చి ఆ గుంతలో ఇరుక్కుపోవడం గమనార్హం.

భక్తి శ్రద్ధలతో తపస్సుమాను



చిల్లకూరు : మండలంలోని కడివేడు గ్రామంలో వెలసిన మాతా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఐదు రోజులపాటుగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మూడో రోజు అమ్మవారి ఉదయం పలు అభిషేకాలు నిర్వహించి దిష్టి తీర్పును తీర్చారు. మధ్యాహ్నం ఆలయానికి సమీపంలో ఉన్న మైదానంలో తపస్సుమాను ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి భక్తులు ముడుపులు చెల్లించి పొంగళ్లు పెట్టి నైవేద్యాలను సమర్పించారు. అనంతరం వనం కొరుకుడు కార్యక్రమం నిర్వహించారు. రంగ రంగు విద్యుత్ దీపాల నడుమ అమ్మవారిని గ్రామోత్సవం చేపట్టారు.

ఏమరుపాటుగా ఉంటే గ్రహపాటే



ప్రమాదకరంగా ఉన్న మలుపు

సైదాపురం: మండలంలోని సైదాపురం –వేములచేడు మార్గంలోని కమ్మవారిపల్లి వద్ద ఉన్న మలుపు ప్రమాదకరంగా మారుతోంది. అవతలి వైపు వస్తున్న వాహనాలు కనపడక పోవడంతో ఈ మలుపు ప్రమాదాలయ నిలయంగామరుతోంది. ఇక్కడ అప్రమత్తంగా లేకుండా వాహనాలు నడిపితే ప్రమాదం తప్పదు. సూచిక బోర్డులను కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

అదుపు తప్పితే అంతేగతి



జాతీయ రహదారి పక్కనే ఐదు అడుగుల గుంత

చిల్లకూరు: నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారి విస్తరణ చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ప్రమాదకరంగా మారుతోంది. జాతీయ రహదారిపై వరగలి క్రాస్ రోడ్డు ప్రాంతంలో ఆరులేన్ల రోడ్డు విస్తరణలో భాగంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. నెల్లూరు వైపు వెళ్లే మార్గంలో రహదారికి ఆనుకుని ఐదడుగుల గుంతను 500 మీటర్ల దూరం తవ్వి వదిలేశారు. దీనికి దగ్గరగా ఎలాంటి ప్రమాదకర హెచ్చరికలు ఏర్పాటు చేయలేదు. చెన్నై, తిరుపతి– బెంగళూరుకు వెళ్లే వాహనాల్లో అధికంగా రాత్రి వేళ రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే అది మంచి నిద్ర సమయం కాబట్టి ఎవరైనా వాహన చోదకులు,గానీ, బస్సు డ్రైవర్లు కానీ ఏమైనా ఏమరుపాటుగా ఉంటే చాలు ఇక్కడ ఉన్న ఐదు అడుగుల గుంతలోకి దూసుకుని వెళ్లి బోల్తా కొట్టడం ఖాయం.

డాక్టరేట్ గ్రహీతలకు సన్మానం



డాక్టరేట్లు పొందిన వారిని అభినందిస్తున్న డీమ్డ్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ వంకి పెంచలయ్య

గూడూరురూరల్ : వివిధ రంగాల్లో ప్రత్యేక పరిశోధనల ద్వారా డాక్టరేట్ పట్టా పొందిన అధ్యాపకులను గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీలో మంగళవారం ఛాన్సలర్ డాక్టర్ వంకి పెంచలయ్య చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. డాక్టర్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ గణిత శాస్త్ర విభాగ అధ్యక్షులు, ప్రొఫెసర్ చీపినేటి సురేష్ రాయలసీమ యూనివర్సిటీ నుంచి, గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ వరదల జగదీష్ ఎస్.వి.యూనివర్సిటీ నుంచి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం అధ్యక్షులు, అసోసియేట్ ప్రొఫెసర్ అమరేంద్ర జడ్డా డాక్టరేట్‌ను అందుకున్నారని పేర్కొన్నారు. తమ సంస్థలో సుదీర్ఘ కాలం పనిచేస్తూ సంస్థ ఉన్నతికి దోహదపడ్డారని కొనియాడారు. డాక్టరేట్ రావడం శుభపరిణామమన్నారు. అనంతరం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాజయ్య, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ పరిశోధన స్థానం పరిశీలన



నిమ్మ మొక్కలను పరిశీలిస్తున్న ఏడీఆర్ రూత్

వెంకటగిరి రూరల్: మండలంలోని పెట్లూరు నిమ్మ చీనీ పరిశోధన స్థానాన్ని తిరుపతి ఏడీఆర్ (అగ్రికల్చర్ డైరెక్టర్ రీసర్చ్) సీహెచ్ రూత్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. నిమ్మ పరిశోధన స్థానంలో పెరుగుతున్న మొక్కలను వాటి విశిష్టతను పరిశీలించారు. అనంతరం శాస్త్రవేత్తలకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం రామయ్య, డాక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, కతివ, ఏఈఓఎస్ సుధాకరశెట్టి, రామకృష్ణ, వెంకటసుబ్బయ్య, మోహన్, మునిచంద్ర పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భవాని

కలువాయి(సైదాపురం): మండలంలోని త్వరితగతిన మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ భవాని తెలిపారు. హౌసింగ్ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు ఆమె మాట్లాడుతూ లక్ష్యాలను అందరూ పూర్తిచేయాలని, పెండింగ్ బిల్లుల సకాలంలో అందేలా చూడాలన్నారు. అనంతరం కలువాయి గృహ నిర్మాణ లేఅవుట్లను పరిశీలించారు. గృహ నిర్మాణాలను గతంలో నిర్మించిన కాంట్రాక్టర్ వివరాలను హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సునీల్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వేడుకగా త్రిశూల గ్రామోత్సవం



త్రిశూల అలంకరణలో అమ్మవారు



త్రిశూల ఊరేగింపులో ఆకట్టుకున్న కాంతార వేషధారులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని లోతువాని గుంట కాలనీలో వెలసిన పోలేరమ్మ పరమేశ్వరి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి త్రిశూల గ్రామోత్సవాన్ని ఆలయ ధర్మకర్త వినుకొండ ధనుంజయ సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద అమ్మవారికి పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేవారు. భక్తులు అమ్మవారికి పొంగలి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారి శూలాన్ని ప్రత్యేక రథంపై అమర్చి కాలనీ ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. ఊరేగింపులో కాంతార వేషధారణలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆల యం వద్ద ప్రత్యేక విద్యుద్దీపకాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఊరేగింపులో కాంతార వేషధారులు, నాదస్వర కచ్చేరీలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



పీఏసీఎస్ భవనానికి వేస్తున్న పసుపు రంగు

రంగు పడింది

చిట్టమూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవనాన్నింటికీ పసుపు రంగు పడుతోంది. గత ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాలకు రంగులు వేస్తే అవి అభ్యంతరకంగా ఉన్నాయని గగ్గోలు పెట్టిన టీడీపీ నాయకులు, ఇప్పుడు అదే పని చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు ఏకంగా పసుపురంగు వేస్తున్నారు. మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయాలకు ఇటీవల నామినేటెడ్ కింద త్రీమ్యాన్ కమిటీని ఎంపిక చేశారు. అంతలోనే సొసైటీ భవనానికి ఇలా పసుపు రంగు అద్దడం విశేషం.